అమృత్ తెలంగాణ
తెలుగు దిన పత్రిక

సంపుటి: 01 సంచిక : 222. ఎడిటర్: సింగిడి అమృత్ తెలంగాణ గురువారం.22.05.2025 పేజీలు:4, వెల:రూ.1.00

## తాయారమ్మకు తుది వీడ్కోలు

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: అనారోగ్యంతో కన్నుమూసిన ఐద్వా సీనియర్ నాయకురాలు కంచి తాయారమ్మకు సీపీఐ(ఎం), ఐద్వా, ఇతర ప్రజా సంఘాల నేతలు, కుటుంబ సభ్యులు బుధవారం తుది వీడ్కోలు పలికారు. మంగళవారం హైదరాబాద్‌లోని సిటిజన్ ఆస్పత్రిలో ఆమె మరణించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం ఆమె భౌతికకాయానికి సీపీఐ (ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.వీరయ్య, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, సీపీఐ (ఎం) సిటీ సెంట్రల్ కమిటీ కార్యదర్శి ఎమ్.వెంకటేశ్, మాజీ కార్యదర్శి ఎమ్.శ్రీనివాస్, మేడ్చల్ కార్యదర్శి సత్యం, సీనియర్ నాయకులు పీఎస్ఎన్ మూర్తి, ఆర్‌బీఐ నాయకులు నాగేశ్వరరావు, కేఎస్ఎన్ రాజు (ఎల్ఐసీ), శ్రీకాంత్, ఈశ్వరరావు (సీఐటీయూ), ఎమ్ఎన్ రెడ్డి (టాప్రా), నవతెలంగాణ ఎడిటర్ సుధాభాస్కర్, సీనియర్ జర్నలిస్టు జీ.రాజకుమారి తదితరులు నివాళులర్పించారు. అనంతరం గాంధీనగర్ నుంచి ఆమె అంతిమయాత్ర బయలుదేరి, ముషీరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి చేరుకుంది.

## ముందస్తు వర్షాలు.. అలెర్ట్‌గా ఉండండి

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ:రాష్ట్రంలోకి నైరుతీ రుతుపవనాలు ముందస్తుగా ప్రవేశిస్తున్నందున, అకాల, భారీ వర్షాల పట్ల జిల్లాల యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ విపత్తుల నిర్వహణ శాఖ (ఎస్డీఆర్ఎఫ్) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్ ఆయా జిల్లాల కలెక్టర్లను హెచ్చరించారు. ఈనెలాఖరులోగానే రుతుపవనాలు వస్తాయని వాతావరణ శాఖ అంచనా వేసిన నేపథ్యంలో రాష్ట్రంలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందనీ, వాటివల్ల ఎలాంటి విపత్తులు జరుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని చెప్పారు. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లకు మార్గదర్శకాలను విడుదల చేశారు. గత ఏడాది ఆగస్టులో వచ్చిన భారీ వర్షాలతో సకాలంలో ఎన్డీఆర్ఎఫ్ దళాలు చేరుకోక పోవడంతో తీవ్ర నష్టం జరిగిందనీ, ఆ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని ఈసారి 12 స్టేట్‌డిజాస్టర్ రిలీఫ్ ఫోర్స్ (ఎస్ఆర్డీఎఫ్)లను సిద్ధంగా ఉంచామన్నారు. ఒక్కో టీమ్‌లో తెలంగాణా స్పెషల్ పోలీస్‌కు చెందిన వందమంది సుశిక్షితులైన పోలీసులు ఉంటారనీ, ఈ బృందాలను రాష్ట్ర వ్యాప్తంగా అందుబాటులో ఉంచామన్నారు.

# పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పడంలో మోడీ వెనకడుగు

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: పహల్గాం మారణకాండ తర్వాత పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పడంలో కేంద్రంలోని మోడీ వెనకడుగు వేశారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతిని పురస్కరించుకుని హైదరాబా ద్‌లోని సచివాలయం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి సీఎం పూలమాలలేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ దేశ పౌరులపై తీవ్రవాదులు దాడులకు తెగబడితే ఆనాడు ఇందిరమ్మ పాకిస్తాన్‌కు గట్టి గుణపాఠం చెప్పారని అన్నారు. మా దేశాన్ని మేం రక్షించుకో గలుగుతాం.. ఎవరి మధ్యవర్తిత్వం అవసరం లేదనే రీతిలో ప్రపంచానికి చాటి చెప్పారని గుర్తు చేశారు. కానీ ప్రస్తుతం పహల్గాం ఘటనలో పాకిస్తాన్‌కు బుద్ధి చెప్పడంలో ప్రధాని విఫలమయ్యారని విమర్శించారు. అమెరికా అధ్యక్షులు ట్రంప్ చెబితేనే కాల్పుల విరమణ చేసే పరిస్థితికి భారత ప్రభుత్వ గ్రాఫ్ పడిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉగ్రవాద దాడులను సమర్థవంతంగా ఎదుర్కోలేని ప్రభుత్వం దేశాన్నీ, దేశ ప్రజలను ఎలా రక్షిస్తుందని ప్రశ్నించారు. ఈ వాస్తవాలను మరిచిన కొంతమంది చేవలేని వ్యక్తులు నేడు రాజీవ్‌గాంధీని విమర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేంద్రానికి అండగా నిలబడాల్సిన సమయంలో బయటకు రాని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డితో పాటు బీజేపీ నేతలు తమ చేతగానితనాన్ని కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధానిగా దేశానికే వన్నె తెచ్చిన మహా నాయకుడు రాజీవ్‌గాంధీ అని సీఎం కొనియాడారు. సరళీకృత ఆర్థిక విధానాలతో ఆయన భారత్‌ను బలమైన దేశంగా నిలబెట్టారని గుర్తు చేశారు. 18 ఏండ్లకే ఓటు హక్కును కల్పించి ప్రభుత్వాల ఏర్పాటులో యువతకు భాగస్వామ్యం కల్పించారని అన్నారు. "సెక్రెటేరియట్ దగ్గర రాజీవ్‌గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే కొందరు సంకుచిత మనస్తత్వంతో విమర్శలు చేశారు.



దేశం కోసం ప్రాణత్యాగం చేసిన చరిత్ర గాంధీ కుటుంబానిది, కాంగ్రెస్ పార్టీది. దేశ రక్షణ కోసం భారత జవాన్లకు అండగా నిలబడతాం. అది మా బాధ్యత. దేశ సమగ్రత విషయంలో మేం రాజకీయాలు చేయం. దేశ భద్రతకు కట్టుబడి పనిచేస్తాం" అని సీఎం స్పష్టం చేశారు. రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పించిన వారిలో పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎంపీ అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జీహెచ్ఎంసీ మేయర్, తదితరులు ఉన్నారు.

# జీవితానికి చదువే కీలకం



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: ప్రతి ఒక్కరి జీవితానికి చదువే కీలకమనీ, దాని ద్వారానే ఉన్నతశిఖరాలకు ఎదుగుతామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ (సీతక్క) నొక్కి చెప్పారు. మూసధోరణిలో చదివితే ప్రయోజనం ఉండదని సూచించారు. విలువలు, వినయం, సంస్కారం, సామాజిక స్పృహ, సమానత్వ భావన నేర్పించేలా ఉపాధ్యాయుల బోధన ఉండాలని ఆకాంక్షించారు. విద్యతో ఎదగాలి..వినయంతో మెలగాలి అని విద్యార్థులకు సూచించారు. బుధవారం హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో గల కొమ్రం ఆదివాసీ భవన్‌లో పదో తరగతి, ఇంటర్, ఎంసెట్, జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆదివాసీ, గిరిజన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను మంత్రి సీతక్క అందజేశారు. ఆదివాసి పవన్ ప్రాంగణంలో ప్రతిష్ఠించిన సమ్మక్క సారలమ్మ గద్దెలను మంత్రి దర్శించుకున్నారు. కొమ్రంభీమ్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. విద్యార్థులు ప్రదర్శించిన కోయ, ఆదివాసీ, గిరిజన సాంప్రదాయ నృత్యాలను మంత్రి తిలకించారు. ఆదివాసీ గిరిజన పెయింటింగ్స్‌తో రూపొందించిన చీరను మంత్రి సీతక్కకు గిరిజన గురుకుల ఫైన్ ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు బహుకరించారు. కార్యక్రమంలో ట్రైకార్ చైర్మెన్ బెల్లయ్య నాయక్, గిరిజన ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మెన్ కె.తిరుపతి, ఎమ్మెల్యే బొజ్జు పటేల్, గిరిజన శాఖ కార్యదర్శి శరత్, గిరిజన గురుకుల సొసైటీ కార్యదర్శి సీతాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. ట్రైబల్ ఏరియాల్లో చదువు లేకపోవడంతో తమను చిన్నచూపు చూశారని తెలిపారు. ఇప్పుడు ప్రయివేటు విద్యాసంస్థల పిల్లలతో పోటీపడి గిరిజన విద్యార్థులు మార్కులు పొందుతున్నారని చెప్పారు. ఎస్టీలు అధికంగా ఉన్న ములుగు, ఆసిఫాబాద్, మహబూబాబాద్ జిల్లాలు టెన్త్ ఇంటర్ ఫలితాల్లో మొదటి స్థానాల్లో నిలవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 8 ఏండ్ల తర్వాత డైట్, 16 ఏండ్ల తర్వాత కాస్మోటిక్ చార్జీలను పెంచామని చెప్పారు. ఇతర విద్యాసంస్థల కన్నా గిరిజన శాఖ పరిధిలోని విద్యాసంస్థల్లో మెరుగైన ఫలితాలు వచ్చాయని తెలిపారు. ఇంటర్‌లోనూ 90 శాతానికిపైగా మార్కులు సాధించేలా పని చేయాలని సిబ్బందికి పిలుపునిచ్చారు. విద్యాసంస్థల్లో ఎస్టీల ప్రత్యేక సంస్కృతిని కాపాడాలన్నారు. ఆదివాసీ గిరిజన విద్యార్థులు తమ ప్రత్యేకతను కాపాడుకోవాలని సూచించారు. గిరిజన సమస్యలేవి ఉన్నా తనతో నేరుగా చెప్పొచ్చని హామీనిచ్చారు. ఐటీడీఏలను తిరిగి బలోపేతం చేయాలని సూచించారు. వందమంది అక్కజెల్లెళ్లను హాస్టల్ తనకిచ్చిందనీ, ప్రస్తుత మీటింగ్‌లోనే తనకు చదువు చెప్పిన ఇద్దరు టీచర్లు ఉన్నారని గుర్తుచేశారు. వారి ప్రోద్బలంతోనే తాను ఈ స్థాయికి ఎదిగా నని చెప్పారు. పురస్కారాలు రాని విద్యార్థులు మరింత పట్టు దలతో ముందుకెళ్లి విజయం సాధించాలని మనోధైర్యాన్ని కల్పించారు. పే బ్యాక్ టు సొసైటీ సిద్ధాంతాన్ని ఆచరణలో చేసి చూపించాలని పిలుపునిచ్చారు. గురుకులాలు, గిరిజన విద్యా సంస్థల గౌరవాన్ని నిలబెట్టేలా విద్యార్థులు కష్టపడి చదవాలని కోరారు.

సమసమాజ స్థాపన కోసం రాజీవ్‌గాంధీ కృషి మంత్రి డాక్టర్ సీతక్క

ప్రధానిగా రాజీవ్ గాంధీ దేశంలో పేదరికాన్ని నిర్మూలించి సమసమాజ స్థాపన కోసం అనేక సంక్షేమ పథకాలు చేపట్టారని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణా భివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ(సీతక్క) కొనియాడారు. బుధవారం హైదరాబాద్‌లోని ప్రజా భవన్‌లో రాజీవ్‌గాంధీ 34వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి మంత్రి సీతక్క పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఆయన హయాంలోనే దేశంలో సాంకేతిక విప్లవం ప్రారంభమైం దనీ, కంప్యూటర్ల వినియోగానికి ఆయన ఊతమిచ్చారని గుర్తుచేశారు. రాజీవ్ గాంధీ ఆశయాలకను గుణంగానే రాష్ట్రాభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. 'యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్' వంటి కార్యక్రమాలను అభివృద్ధి చేస్తూ యువత భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య యాదవ్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, తదితరులు పాల్గొన్నారు.

# వక్ఫ్‌బోర్డుల్లో ముస్లిమేతరులు ఉంటారు

న్యూఢిల్లీ : అమృత్ తెలంగాణ:వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులు వుంటారని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. వైవిధ్యతను పెంపొందించడం కోసమే వక్ఫ్ బోర్డుల్లో ముస్లిమేతరులను చేరుస్తున్నామని, ఈ వక్ఫ్ బోర్డులు లౌకిక విధులను నిర్వహిస్తాయని, అందువల్ల ముస్లిమేతరులతో సహా ఎవరి పనితీరు ప్రభావితం కాదని కేంద్రం ప్రభుత్వం పేర్కొంది. అందువల్ల, వక్ఫ్ బోర్డులలో ముస్లిమేతరులను చేర్చడాన్ని అనుమతిస్తామని, అది కూడా కేవలం ఇద్దరికి మాత్రమే పరిమితం చేశామని స్పష్టం చేసింది. దీనివల్ల వక్ఫ్ అడ్మినిస్ట్రేషన్ యొక్క ఇస్లామిక్ స్వభావం విషయంలో రాజీ పడకుండా సమతూకంతో కూడిన పారదర్శక పాలనకు హామీ కల్పించబడు తుందని కేంద్రం పేర్కొంది. ఈ చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై బుధవారం కూడా విచారణ కొనసాగింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవారు, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. వక్ఫ్ అనేది ఇస్లామిక్ భావనే గానీ ఇస్లాంలో కీలక భాగం కాదన్నారు. ఇది ప్రాథమిక హక్కు కాదన్నారు. దేశంలోని 140 కోట్ల మంది ప్రజలను, వాళ్ల ఆస్తుల్ని సంరక్షించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం మీద వుందన్నారు. ప్రజల ఆస్తులను అక్రమంగా పక్కదారి పట్టించే ప్రయత్నాలను సర్కారు చూస్తూ ఊరుకోద న్నారు. వక్ఫ్ చట్టంపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ బోర్డు ఉన్నది సేవ కోసమేనని అన్నారు. వక్ఫ్ బోర్డులో ఇద్దరు ముస్లిమేతరులు వుంటే వచ్చే నష్టం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇందులో మతపరమైన అంశాల జోక్యమేమీ లేదన్నారు. వక్ఫ్ చట్టానికి సవరణలు చేసే ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ ఏకంగా 96లక్షల మంది ముస్లింలను కలిసిందన్నారు. వారందరితో చర్చోపచర్చల తరువాత అందరి సలహాలు, సూచనలను పరిగణనలోకి తీసుకొని కేంద్రం ఈ చట్టాన్ని సవరించిందన్నారు. "దానధర్మాలు ప్రతి మతంలో భాగమని, క్రైస్తవులు, హిందువులు, సిక్కులకు కూడా ఈ దాన వ్యవస్థ వుంది. వక్ఫ్ అనేది ఇస్లాంలో దాతృత్వం తప్ప మరొకటి కాదు. వక్ఫ్ బోర్డు వక్ఫ్ ఆస్తులను నిర్వహించడం, అకౌంట్ ఖాతాలను ఆడిట్ చేయడం వంటి లౌకిక విధులను మాత్రమే నిర్వహిస్తుంది. నేను ముస్లిమేతరులైన ఇద్దరు సభ్యుల గురించే చెబుతున్నాను. వక్ఫ్ బోర్డులలో ఇద్దరు ముస్లిమేతరులు వుండటం వల్ల ఏమి మారుతుంది. వక్ఫ్ బోర్డుకు ఎలాంటి మతపరమైన కార్యకలాపాలకు సంబంధం లేదు.' అని మెహతా అన్నారు.

వక్ఫ్‌కు, హిందూయేతరులను సభ్యులుగా అనుమతించని హిందూ ట్రస్టులు,




ఎండోమెంట్ బోర్డులకు మధ్య గల తేడా గురించి కూడా చెప్పడానికి ఆయన ప్రయత్నించారు. హిందూ ఎండోమెంట్ బోర్డులలో హిందూయేతరులను అనుమతించనప్పుడు, ముస్లిమేతరులను వక్ఫ్ బోర్డులలో ఎలా అనుమతిస్తారన్నది పిటిషనర్లు చేస్తున్న వాదనలలో ఒకటి.

"హిందూ ఎండోమెంట్ బోర్డులు కేవలం మతపరమైన కార్యకలాపాలను మాత్రమే నిర్వహిస్తాయని అదే సమయంలో వక్ఫ్ బోర్డు లౌకిక కార్యకలాపాలను నిర్వహిస్తుంది." అని చెప్పారు. హిందూ ఎండోమెంట్ బోర్డుల అధికారాల పరిధి చాలా విస్తారంగా వుంటుందని, వారు కావాలంటే ఆలయం లోపలకు కూడా వెళ్ళగలరని, పూజలకు ఏం కావాలో కొనగలరని చెప్పారు. తమిళనాడులో అర్చకులను రాష్ట్ర ప్రభుత్వమే నియమిస్తోందని, కానీ ఇక్కడ మాత్రం మనం లౌకిక వక్ఫ్ బోర్డుల్లో ఇద్దరు ముస్లిమేతరులు వుండడంపై వివాదాన్ని చేస్తున్నామని తుషార్ మెహతా వాదించారు. వక్ఫ్‌బోర్డుల్లో 11మంది సభ్యుల్లో ఇద్దరు, సెంట్రల్ కౌన్సిల్‌లో వుండే 22మంది సభ్యుల్లో నలుగురు ముస్లిమేతరులు అయినంత మాత్రాన అది ఉల్లంఘనల కిందకు రాదని మెహతా వాదించారు.

ఇస్లాంకి సంబంధించిన ఎలాంటి మతపరమైన అంశాల విషయంలో వక్ఫ్ చట్టం–2025 జోక్యం చేసుకోదని కేవలం ముతవాలీ (వక్ఫ్ ఆస్తుల మేనేజర్) గురించే మాట్లాడుతోందని రుజువు చేయడానికే తాను ఈ అంశాన్ని లేవనెత్తానని చెప్పారు. ముతవాలీలను ఎవరు నియమిస్తారని సీజేఐ ప్రశ్నించగా, వక్ఫ్ బోర్డేనని చెప్పారు. అయన ముస్లిమేతరుడు అయి వుండవచ్చా అనగా వుండొచ్చునని, ఆయనకు ఎలాంటి మత పరమైన కార్యకలాపాలు వుండవన్నారు.

# కోదాడలో మంత్రి ఉత్తమ్ హెలికాప్టర్ ఎమర్జెన్సీ ల్యాండింగ్

కోదాడటౌన్ : అమృత్ తెలంగాణ: మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి ప్రయాణిస్తున్న హెలికాప్టర్ వాతావరణంలో ఏర్పడిన మార్పుల వల్ల కోదాడలో అత్యవసర ల్యాండింగ్ అయింది. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ నియోజకవర్గంలో మంత్రి సుడిగాలి పర్యటనకు ఏర్పాట్లు జరిగింది. ఇందుకోసం హైదరాబాద్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో మంత్రి ఉత్తమ్ బుధవారం బయల్దేరారు. కోదాడ సమీపంలోకి రాగానే ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడం, సన్నపాటి వర్షం కూడా ప్రారంభం కావడంతో పైలట్ అప్రమత్తమయ్యారు. వాతావరణ శాఖ సూచన మేరకు హెలికాప్టర్‌ను కోదాడలో



అత్యవసర ల్యాండింగ్ చేశారు. మంత్రి కోదాడ నుంచి హుజూర్‌నగర్‌కు రోడ్డు మార్గంలో వెళ్లిపోయారు. మంత్రి హెలికాప్టర్ హైదరాబాద్ నుంచి నేరుగా సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం మేళ్లచెరువులో ల్యాండ్ కావాల్సి ఉంది.

# ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేసీఆర్‌కు నోటీసులు

నల్లగొండ .అమృత్ తెలంగాణ: పాలన చేతకాక, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకే కేసీఆర్‌కు కమీషన్ల పేరుతో నోటీసులు జారీ చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. నల్లగొండ పట్టణంలోని ఎంఎన్ఆర్ కన్వెన్షన్‌లో బుధవారం ఒక వివాహానికి హాజరైన ఆయన.. అనంతరం మీడియాతో మాట్లాడారు. న్యాయవ్యవస్థపై తమకు నమ్మకం ఉందని, క్షేసీఆర్‌కు ఎన్ని నోటీసులు ఇచ్చినా అవి దూది పింజల్లా ఎగిరిపోతాయని అన్నారు. తెలంగాణ కోసం కష్టపడిన వారికి దేవుడు అండగా ఉంటాడని, న్యాయం, ధర్మం గెలుస్తుందని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి బుద్ధి చెప్పే రోజులు త్వరలోనే వస్తాయన్నారు. కమీషన్లు తీసుకోనిదే పనులు జరగడం లేదని స్వయంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులే చెబుతున్నారని అన్నారు. కమీషన్లు తప్ప ప్రభుత్వానికి పాలన చేతకాదని విమర్శించారు. కాంట్రాక్టర్లు సచివాలయంలోనే ధర్నా చేయడం వాస్తవ పరిస్థితికి అద్దం పడుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును విఫల ప్రయోగంగా చిత్రీకరించేందుకు కుట్రలు చేస్తూ కాంగ్రెస్, బీజేపీ కలిసి నాటకాలు ఆడుతున్నాయని ఆరోపించారు. ఎస్ఎల్‌బీసీ టన్నెల్ కూలి 8 మంది ప్రాణం కోల్పోయి నేటికి 3 నెలలు అవుతున్నా మృతదేహాలను వెలికితీయలేదు.. సమర్థుడైన ముఖ్యమంత్రి ఉంటే మృతదేహాలను బయటకు తీసుకొచ్చేవారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడ సహాయక చర్యలు చేపట్టే తెలివి కూడా లేకపోయిందని విమర్శించారు. మీ కమీషన్‌ల ఆరాటంతో మృతదేహాలను వెలికితీయడానికి కూడా సాహసం చేయలేకపోయారన్నారు. అక్కడ ఏం జరిగిందో ఇప్పటికీ చెప్పలేని దద్దమ్మ ప్రభుత్వం ఇది అని విమర్శించారు. నల్లగొండలో సుంకిశాల ప్రాజెక్ట్ కూలింది.. ఇప్పటికీ సంస్థ మీద ఎలాంటి చర్యలూ తీసుకోలేదని, ప్రభుత్వం స్పందించలేదని అన్నారు. వడ్డేం పంప్‌హౌస్ మునిగింది.. దానిమీద చర్యలు లేవన్నారు.



పెద్ద వాగు ప్రాజెక్టు రెండుసార్లు కొట్టుకుపోయినా చర్యల్లేవని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తప్పించుకునే ప్రయత్నం చేస్తోంద న్నారు. కోటి 60 లక్షల మంది ఆడబిడ్డలు రూ.2500 ఎప్పుడు ఇస్తావు అని అడుగుతున్నారని, ఇచ్చిందాక తాము అడుగుతూనే ఉంటామని అన్నారు. ఆరు గ్యారంటీలు 420 హామీలు అమలు చేయలేని చేతకాని ప్రభుత్వం ఇది అని విమర్శించారు. 17 నెలల నుంచి చిల్లర వేషాలే.. ఈ త్రీడీ మంత్రం ఎక్కువ రోజులు నడవదని అన్నారు. ఆయన వెంట సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# జూన్ 5న రామ్‌దర్బార్ ప్రాణప్రతిష్ఠ



హైదరాబాద్: అమృత్ తెలంగాణ: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో శ్రీరామ మందిర నిర్మాణం తుది దశకు చేరుకుంది. జూన్ 5వ తేదీ నాటికి ఆలయ నిర్మాణ పనులు పూర్తవుతాయని శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నిర్మాణ కమిటీ ఛైర్మన్ నృపేంద్ర మిశ్రా తెలిపారు. ఈ చారిత్రక ఘట్టానికి గుర్తుగా, జూన్ 3 నుంచి 5వ తేదీ వరకు ఆలయ ప్రాంగణంలో రామ్‌దర్బార్ విగ్రహాల ప్రాణప్రతిష్ఠ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు.

# సినీ థియేటర్ల మూసివేత నిర్ణయం వాయిదా

హైదరాబాద్: అమృత్ తెలంగాణ:జూన్ 1వ తేదీ నుంచి తెలుగు రాష్ట్రాల్లో థియేటర్లను మూసివేయాలని ఎగ్జిబిటర్లు తీసుకున్న నిర్ణయం ప్రస్తుతానికి వాయిదా పడింది. ఈ విషయమై మంగళవారం తెలుగు ఫిలిం ఛాంబర్ కార్యాలయంలో ఉదయం నుంచి నిర్మాతలు, పంపిణీదారులతో జరిగిన వేర్వేరు సమావేశాల్లో సుదీర్ఘ చర్చల అనంతరం ఈ మేరకు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. థియేటర్లను నడుపుతూనే ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించుకోవాలని మెజారిటీ సభ్యులు అభిప్రాయపడినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే, ఉదయం 11 గంటలకు తెలుగు ఫిలిం ఛాంబర్ ప్రతినిధులు తెలుగు రాష్ట్రాల డిస్ట్రిబ్యూటర్లతో సమావేశమయ్యారు. ఈ భేటీకి సుమారు 40 మంది డిస్ట్రిబ్యూటర్లు హాజరైనట్లు సమాచారం. అనంతరం, సాయంత్రం 4 గంటలకు తెలుగు నిర్మాతలతో ఛాంబర్ పెద్దలు చర్చలు జరిపారు.


# తాసిల్దార్ ను సన్మానించిన బిజెపి నాయకులు




తాసిల్దార్ ను సన్మానిస్తున్న బిజెపి నాయకులు

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి మే 21 .అమృత్ తెలంగాణ బదిలీపై నర్సాపూర్ మండలానికి విచ్చేసిన తాసిల్దార్ శ్రీకాంత్, కు రాంపూర్ బిజెపి నాయకులు ఘనంగా సన్మానించడం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షుడు ఠాకూర్ అర్జున్, మాజీ సర్పంచులు సాయన్న, శంకర్, నారాయణ, ప్రవీణ్, హనుమాన్లు, తదితరులు పాల్గొన్నారు

# అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ క్రింద కౌన్సిలింగ్ ద్వారా పారదర్శకంగా బదిలి ప్రక్రియ నిర్వహించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : 66 మంది సివిల్ కానిస్టేబుల్స్ 29 మంది హెడ్ కానిస్టేబుల్స్ 6 మంది ఎ.ఎస్.ఐలకు అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ క్రింద కౌన్సిలింగ్ ద్వారా పారదర్శకంగా బదిలి ప్రక్రియ నిర్వహించిన జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్

తేది : 21-05-2025 నాడు భైంసా మరియు నిర్మల్ సబ్ డివిజినల్ పరిధిలోని " సివిల్ కానిస్టేబుల్స్. హెడ్ కానిస్టేబుల్స్ మరియు ఎ.ఎస్.ఐలకు జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపిఎస్ ఆధ్వర్యంలో అడ్మినిస్ట్రేషన్ గ్రౌండ్స్ క్రింద బదిలీల ప్రక్రియ నిర్వహించడం జరిగింది.

1) గత ఆరు సంవత్సరాల తరువాత ఇప్పటి వరకు బదిలీలు కాని వారు,
2) 4 సం. సర్వీసు ఒకేచోట పూర్తి చేసిన వారు,
3) 3 సం. సర్వీసు పూర్తి చేసిన ఎ.ఎస్.ఐలు

బదిలీ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించినందుకు బదిలీ అయిన పోలీస్ సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి, అంగన్వాడీల బలోపేతానికి కృషి చేస్తామని ఆదిలాబాద్ ఎంపీ నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ పేర్కొన్నారు



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : బుధవారం మావల మండలం దుబ్బగూడా లో పాఠశాల, అంగన్వాడి నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో అద్దె భవనంలో పాఠశాల, అంగన్వాడి కేంద్రం కొనసాగుతుండదని.. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారన్నారు. ఎట్టి పరిస్థితులు ఈ సమస్యను పరిష్కరించాలని లక్ష్యంతో భూమి పూజ చేయడం జరిగిందని పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నాదని తెలిపారు

# డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ తిరుపతి సస్పెన్షన్

జన్నారం:అమృత్ తెలంగాణ: కవ్వాల్ టైగర్ జోన్ జన్నారం అటవీ డివిజన్ పరిధిలో జన్నారం రేంజ్ డిప్యూటీ అధికారి గా విధులు నిర్వహిస్తున్న తిరుపతిని సస్పెండ్ చేసినట్లు ఎఫ్ డి పి టి శాంతారావు, మంచిర్యాల డిఎఫ్ఓ శివ్ ఆశిష్ సింగ్ బుధవారం తెలిపారు. జన్నారం అటవీ రేంజ్ కొత్తూరు పల్లె సమీపంలోని రిజర్వ్ అటవీ ప్రాంతంలో అక్రమంగా గుడిసెలు వేసుకుని ఉన్న 22 మంది గిరిజనుల గుడిసెలను అటవీ అధికారులు దాడి చేసి తొలగించడం, అటవీ భూముల సంరక్షణలో నిర్లక్ష్యంవాహించినందుకు గాను సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. అటవీ అధికారులు విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# గంజాయి అమ్ముతున్నారనే సమాచారం తో దొరికిన వ్యక్తులను బైండోవర్ చేసిన నిర్మల్ పోలీసులు




అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : ఈ రోజు అనగా తేది:21.05.2025 రోజున మద్యాహ్నం సమయం లో ఇద్దరు వ్యక్తులు విశ్వనాథ్ పేట్ , నిర్మల్ నందు గంజాయి అమ్ముతున్నారు అని నిర్మల్ రూరల్ SI కి సమాచారం రాగా, తక్షణమే స్పందించి ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చి , వారి ఆదేశాలతో SI లింబాద్రి తన సిబ్బంది తో అక్కడికి చేరుకొనగా ఇద్దరు వ్యక్తులు.

1. సత్యపోలు యోగేష్ వయస్సు :22 సం. వృత్తి: స్టూడెంట్, నివాసం: గుండం పెల్లి గ్రామం

2. షేక్ కైఫ్ , వయస్సు :19 సం. వృత్తి: బైక్ మెకానిక్, నివాసం: పురాన బజార్, భైంసా వారిని పట్టుకుని వెతకగా వారి వద్ద ఎటువంటి గంజాయి దొరకలేదు కానీ వారు భవిష్యత్ లో గంజాయిని సేవించడం లేదా విక్రయించే అవకాశం ఉంది అని భావించి వారిని నిర్మల్ రూరల్ తహశీల్దార్ గారి ముందర బైన్డ్ ఓవర్ చేయడం జరిగినది, వారు నిబంధనలు అతిక్రమిస్తే వారికి ఒక లక్ష రూపాయల జరిమానా లేదా చట్ట పరమైన చర్యలు తీసుకొనబడును అని తహసీల్దారు వారికి వివరించారు.

# 13 మంది పేకాట రాయుళ్ల అరెస్ట్ - ఇచ్చోడ సిఐ బండారి రాజు.

**నేరడిగొండ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు.**
**పేకాట ముక్కలు, రూ 14,080/- నగదు, ఆరు బైకులు, 13 మొబైల్ ఫోన్స్ స్వాధీనం.**
**నేరడిగొండ నీలిమా దాబా వెనకాల సంఘటనా స్థలంలో పట్టుబడ్డ 13 మంది నేరస్తులు.**





అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : జిల్లావ్యాప్తంగా అసాంఘిక కార్య కలాపాలను పూర్తిగా రూపుమాపాలనే జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు విశ్వసనీయ సమాచారంతో నేరడిగొండ మండలం నీలిమ ధాబా వెనకాల పేకాట ఆడుతున్నారనే సమాచారంతో ఇచ్చోడ సిఐ మరియు నేరేడుగొండ ఎస్సై దాడి చేయగా సంఘటన స్థలంలో 13 మంది నేరస్తులు పట్టుబడ్డారని ఇచ్చోడా సీఐ బండారి రాజు తెలిపారు. వీరి వద్దనుండి పేకాట ముక్కలు రూ 14,080/- నగదు, ఆరు బైక్లు, 13 మొబైల్ ఫోన్స్ స్వాధీనం చేసుకొని నేరడిగొండ పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేయడం జరిగింది అని తెలిపారు. మండల పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు చోటు లేకుండా గట్టి గస్తీ నిర్వహిస్తూ అరికట్టడం జరుగుతుందని తెలిపారు. వారి వివరాలు సయ్యద్ జహీర్, గడ్డం రవిచందర్ రెడ్డి, గూడూరు లవ కుమార్, రాథోడ్ రవీందర్, అల్లూరి శివారెడ్డి, ఉప్పు పోశెట్టి, సోలంకి శ్రీనివాస్, నల్ల అడెల్లు, సోలంకి కరన్ సింగ్, గోతి గులాబ్ సింగ్, మాడ గంగాధర్, అల్లూరి శ్రీనివాస్ రెడ్డి, పవర్ సంతోష్ లు ఉన్నట్లు వీరందరూ నేరడిగోండా మరియు దగ్గరలో ఉన్న గ్రామాలకు చెందిన వారిని తెలిపారు. ఈ ఆపరేషన్ నందు ఇచ్చోడ సిఐ బండారి రాజు, నేరడిగొండ ఎస్ ఐ శ్రీకాంత్ సిబ్బంది పాల్గొన్నారు.

# వ్యవసాయ క్షేత్రంలో డి ఆర్ డిఓ జన్మదిన వేడుకలు



ముథోల్ :అమృత్ తెలంగాణ: ముథోల్ మండలంలోని తరోడ గ్రామంలో సమీకృత వ్యవసాయ క్షేత్రంలో బుధవారం రోజు నిర్మల్ జిల్లా డిఆర్ డిఓ విజయలక్ష్మి జన్మదిన వేడుకలను ఐకెపి, ఉపాధిహామీ సిబ్బంది నిర్వహించారు. సమీకృత వ్యవసాయ క్షేత్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించడానికి రానున్నటంతో డి ఆర్ డి ఓ విజయలక్ష్మి వ్యవసాయ క్షేత్రానికి ముందుగా వచ్చారు. దీంతో డి ఆర్ డి ఓ కు జన్మదిన శు భాకాంక్షలను ఐకెపి, ఉపాధి హామీ సిబ్బంది తెలిపారు.వెంటనే కేకును తెప్పించి డిఆర్ డిఓ తో కేక్ కట్ చేయించారు.ఈసందర్భంగా ప్రతి ఒక్కరు జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించిన అనంతరం డి ఆర్ డి ఓ కు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శివకుమార్, ఎపిఓ శిరి షా రెడ్డి, ఏపీఎం గురు చరణ్, ఐకెపి, ఉపాధి ఉపాధి సిబ్బంది , మహిళా సంఘాల సభ్యులు, పాల్గొన్నారు.

# మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు.. ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు



ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు జరుపుకున్న కాంగ్రెస్ నాయకులు

నిర్మల్ జిల్లా భైంసా మే21 అమృత్ తెలంగాణ ఘనంగా రాజీవ్ గాంధీ వర్ధంతి వేడుకలు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ కార్యక్రమం లో ఏఎంసీ వైస్ చైర్మన్ ఎండీ, ఫరూక్ అహ్మద్, మాజీ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ రాజన్న, చోండి రాజేశ్వర్, SD ఆలా, ఖాళీద్ ఖాన్, కర్బాల మాజీ సర్పంచ్ సాయినాథ్ పటిల్, SD సాబీర్, భైంసా మండలం యూత్ అధ్యక్షులు దిక్షిత్, ధన, అవినాష్, గాఫూర్, ఇమ్రానుద్దీన్, అహ్మద్ ఖాన్, గున్నుబాయ్ మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై రైతుల ధర్నా మద్దతు పలికిన : బి ఆర్ ఎస్ నాయకులు



రైతుల తో జాతీయ రహదారిపై తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని బిఆర్ఎస్ నాయకులు ఆందోళన నిర్వహిస్తున్న దృశ్యం




తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను వేడుకుంటున్నా రైతులు

నిర్మల్ జిల్లా నర్సాపూర్ జి మే 21 అమృత్ తెలంగాణ గత రెండురోజుల నుండి అకాల వర్షాలు పడడం వల్ల జిల్లాలో ధాన్యం మొత్తం ఎక్కడికక్కడ నిల్వ ఉండడంతో తడిసిపోయి ఉంది దీన్ని తక్షణం కొనుగోలు చేసి తక్కువ కట్టింగ్ తో మిల్లర్లు కు తరలించాలని కోరుతూ నిర్మల్ భైంసా జాతీయ రహదారిపై ఆర్లి X రోడ్డు వద్ద లోకేశ్వరం కుంటాల మరియు నర్సాపూర్ మండలాల రైతులు ధర్నాకు దిగారు దీనితో కిలోమీటర్లు కొద్దీ వాహనాలు నిలిచిపోయాయి పోలీసులు మరియు భైంసా RDO కమల్ రెడ్డి గారు వచ్చి హామీ ఇవ్వడంతో రైతులందరూ దీక్ష విరమించారు ఈ కార్యక్రమంలో ముధోల్ బిఆర్ఎస్ సమన్వయ కమిటీ సభ్యులు డా.కిరణ్ కోమరెవార్, జిల్లా సోషల్ మీడియా అధ్యకులు దశరథ్ పెంటవార్ నర్సాపూర్, కుంటాల మరియు బాసర మండలాల అధ్యకులు సుధాన్ , పడకంటి దత్తు, కోర్వ శ్యామ్, గ్రీన్ ఛానల్ అధ్యకులు అశోక్ రాథోడ్,రాజురా అనిల్ రజినీకాంత్, రావుల పోశెట్టి , హాసడె సజన్ ,వంశీ మరియు మహేష్ ఎర్రం తదితరులు

# అకాల వర్షం అన్నదాత ఆగం.... తడిసిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేయాలి రైతులు



నిర్మల్ జిల్లా నర్సాపూర్ జీ: మే 21 అమృత్ తెలంగాణ నర్సాపూర్ జి మండలంలోని అర్లి' కె మరియు ఆయా. గ్రామాల్లో బుధవారం ఉదయం కురిసిన వర్షంతో రైతులు ఆందోళనకు గురయ్యారు ఆరుగాలం కష్టానికి ఫలితం లేకుండా పోతుందని రైతులు వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాల్లో తేమశాతం వచ్చినప్పటికీ. హమాలీల కొరత , కేంద్రం నిర్వాకుల నిర్లక్ష్యం కారణంగా తూకం వేయడం ఆలస్యం జరుగుతుంది. వర్షాలకు అన్నదాతలు ధాన్యాన్ని కాపాడుకొనేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు..ఇప్పటికైనా అధికారులు స్పందించాలని రైతులు వాపోతున్నారు.



తడిసిన ధాన్యాన్ని చూపుతున్న రైతులు


# కేసుల దర్యాప్తును సమర్థవంతంగా పూర్తి చేయాలి - జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్

**ఉట్నూర్ సబ్ డివిజన్ పెండింగ్ లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులపై ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు**
**దాదాపు 200 కేసులను పూర్తి చేసే దిశగా కార్యచరణ.**
**వివిధ చిన్న చిన్న కారణాలతో పెండింగ్లో ఉన్న కేసుల దర్యాప్తును పూర్తి చేసి బాధితులకు త్వరగా న్యాయం చేయాలి.**
**ఉట్నూర్ డిఎస్పీ కార్యాలయం నందు సబ్ డివిజనల్ పోలీస్ అధికారులతో, సిబ్బంది తో ఒకరోజు స్పెషల్ డ్రైవ్**



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : సబ్ డివిజనల్ పరిధిలో దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను త్వరగా పూర్తిచేసి బాధితులకు సరైన సమయంలో న్యాయం చేకూర్చే విధంగా జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ప్రత్యేక కార్యచరణను రూపొందించారు. ఈ సందర్భంగా వాటిని అవలంబించే దిశగా మొదటి అడుగుగా ఉట్నూర్ సబ్ డివిజనల్ పరిధిలో ఉన్న మూడు సర్కిల్ ఆఫీసులు, 8 పోలీస్ స్టేషన్లో పరిధిలో ఉన్న అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులలోని దాదాపు 200 కేసులను పరిష్కరించే దిశగా ఆదేశాలను ఇవ్వడం జరిగింది. పెండింగ్ లో ఉన్న కేసులలో ఎం.వి.ఐ రిపోర్టులు, పి ఎం వి రిపోర్టులు, అగ్రికల్చర్ కార్యాలయం ఉన్న రిపోర్టులు, వేటర్నరీ కార్యాలయంలో ఉన్న రిపోర్టులను సాధ్యమైనంత త్వరగా తీసుకొని దర్యాప్తు పూర్తిచేసి పెండింగ్ కేసులు పూర్తి చేయాలని సూచించారు. బాధితుల కేసులను దర్యాప్తు పూర్తి చేసి నేరస్తులకు శిక్షలు పడినప్పుడు సరైన న్యాయం చేకూరుతుందని తెలిపారు. కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ వారిగా పెండింగ్లో ఉన్న ఒక్కొక్క కేసు వివరాలను క్షుణ్ణంగా అధికారులను అడిగి తెలుసుకుని, సులువుగా పూర్తి చెసే కేసులను మరియు మొత్తంగా ఈరోజు దాదాపు 200 కేసులను సాధ్యమైనంతవరకు పరిష్కరించే దిశగా కృషి చేయాలని తెలిపారు. అదేవిధంగా ప్రతి ఒక్క పోలీస్ స్టేషన్ అధికారికి ప్రత్యేకంగా ఈరోజు స్పెషల్ డ్రైవ్ లో భాగంగా దర్యాప్తును పూర్తి చేయాలని ఆదేశాలను జారీ చేసారు. ఈ కార్యక్రమంలో ఉట్నూరు ఎఎస్పీ కాజల్ సింగ్ ఐపీఎస్, సిఐ లు జి మొగిలి,రహీం పాషా, సబ్ డివిజన్ ఎస్సైలు పోలీస్ సిబ్బంది రైటర్లు తదితరులు పాల్గొన్నారు.

## బుధవారం న్యూ హౌజింగ్ బోర్డు కాలనీలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన రెడ్డి వసతి గృహ సముదాయాన్ని ఎమ్మెల్యే పాయల్ శంకర్ తో కలిసి పూజలు చేసి ప్రారంభించారు.





సమావేశంలో మాట్లాడుతున్న అదిలాబాద్ శాసనసభ్యులు పాయల్ శంకర్

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్లిసమాజంలో ఉన్న పేదలను ఉన్నత స్థాయికి తీసుకువచ్చేందుకు కుల సంఘాలు చేస్తున్న కృషి అభినందనీయమని ఎంపీ గోడం నగేష్ అన్నారు. బుధవారం న్యూ హౌజింగ్ బోర్డు కాలనీలో రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన రెడ్డి వసతి గృహ సముదాయాన్ని ఎమ్మెల్యే పాయల్ శంకర్ తో కలిసి పూజలు చేసి ప్రారంభించారు. ముందుగా రాజ బహదూర్ వెంకట్రాంరెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తమ సమాజంలోని పేదలను ఆదుకునేల కుల సంఘాలు చేపట్టే కార్యక్రమాలు ఇతర సంఘాలకు ఆదర్శంగా ఉంటాయన్నారు. రెడ్డి సంఘంలోని పేద విద్యార్థుల కోసం వసతి గృహం ఏర్పాటు చేయడం మంచి పరిణమమని అన్నారు. ఐక్యంగా ఉంటు సంఘంతో పాటు సమాజంలోని సభ్యుల అభివృద్ధికి పాటుపడాలన్నారు. వీరితోపాటు నాయకులు రత్నాకర్ రెడ్డి అశోక్ రెడ్డి కరుణాకర్ రెడ్డి. రాకేష్ రెడ్డి ఉన్నారు

## రాజీవ్ యువ వికాసం, ఉల్లాస్, బడిబాట, ఓపెన్ స్కూల్ లకు సంబంధించి వివిధ రకాల అంశాల పై జిల్లా పాలనాధికారి రాజర్షి షా బుధవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాల పై ఆరా తీసి దిశా నిర్దేశం చేశారు.



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ రాజీవ్ యువ వికాసం, ఉల్లాస్, బడిబాట, ఓపెన్ స్కూల్ లకు సంబంధించి వివిధ రకాల అంశాల పై జిల్లా పాలనాధికారి రాజర్షి షా బుధవారం ఐటిడిఎ పిఒ, అదనపు కలెక్టర్, సబ్ కలెక్టర్, ఆర్డీఓ, drdo PD, జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో లు, ఎంపీ ఓ లు, పంచాయితి సెక్రటరీ లు, RP lu, LDM, తదితర అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి పలు అంశాల పై ఆరా తీసి దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తులు చేసుకున్న వారి దరఖాస్తులు బ్యాంక్ వెరిఫికేషన్ పై అన్ని మండలాలకు సంబంధించిన దరఖాస్తుల ఎన్ని పూర్తయ్యాయని అడిగి తెలుసుకున్నారు. రాజీవ్ యువ వికాసం స్కీమ్ కు సంబంధించి దరఖాస్తుల పరిశీలన కొనసాగుతోంది. ఈ ప్రక్రియను త్వరిగతగతిన పూర్తి చేసి యూనిట్లను మంజూరు చేయడం జరుగుతుందని, అయితే ఈ స్కీమ్ కింద మంజూరు చేసే యూనిట్లకు బ్యాంకు లింకేజీని తప్పనిసరి అన్నారు. కేటగిరీల వారీగా ఈ రాయితీ అందుతుందని, రూ. 50 వేల నుంచి రూ. 4 లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉంటుందని, ఇందులో కేటగిరీ–1 కింద రూ.50 వేల విలువైన యూనిట్కు వంద శాతం రాయితీ ఉంటుందన్నారు. బ్యాంకు లింకేజీ లేకుండానే ఈ రుణాన్ని అమలు చేస్తారు. కానీ మిగతా కేటగిరిలో మాత్రం బ్యాంక్ లింకేజీని తప్పనిసరిగా అమలు చేయనున్నారు. ఈ పథకం ద్వారా లబ్ధిదారులకు అందించే రుణాలను బ్యాంకు ద్వారా ధ్రువీకరించడం. దీనిలో భాగంగా, అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్న తర్వాత, వారి వివరాలను బ్యాంకు ద్వారా ధ్రువీకరిస్తారని, ఈ ధ్రువీకరణ ప్రక్రియ ద్వారా, అభ్యర్థులు పథకం నిబంధనలకు అర్హులుగా ఉన్నారా లేదా అని నిర్ధారించడం జరుగుతుందని అన్నారు పథకం ద్వారా లబ్ధిదారులకు అందించే రుణాల పారదర్శకతను నిర్ధారించడానికి. నిధుల దుర్వినియోగం కాకుండా నిధులు పక్కదారి పట్టకుండా చూసేందుకు. అర్హత గల వారికి మాత్రమే రుణాలు అందించేందుకు పకడ్బందీగా పరిశీలించాలని, పథకం నిబంధనలకు అర్హులుగా ఉన్న వారికి మాత్రమే రుణాలు మంజూరు చేయడానికి అర్హత గల జాబితాను సమర్పించాలని అన్నారు. అన్ని మండలాల్లోని బ్యాంకులలో దరఖాస్తుల పరిశీలన త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. మొదటిసారి ఎకనమిక్ సపోర్ట్ స్కీమ్(ఈఎస్ఎస్)కు దరఖాస్తు చేసుకునేవారికి, మహిళలకు 25 శాతం (ఒంటరి మహిళ, వితంతువులకు ప్రాధాన్యం), వికలాంగులకు 5 శాతం, తెలంగాణ ఉద్యమకారుల కుటుంబాలు, ఎస్సీ వర్గీకరణ ఉద్యమ కుటుంబాలకు, వృత్తి నైపుణ్యం గల వారికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. అనంతరం రాబోయే వర్షాకాలం దృష్ట్యా అన్ని పకడ్బందీ చర్యలు చేపట్టాలని ముఖ్యంగా శానిటేషన్ పై దృష్టి సారించాలని , ప్రతీ రోజూ నాళాలను శుభ్రం చేయాలని, ఫ్రై డే డ్రై డే నిర్వహించాలని, సీజనల్ వ్యాదులు రాకుండా జాగ్రత్తలు పాటించాలని, నర్సరీల్లో అన్ని రకాల మొక్కలు అందుబాటులో ఉంచాలని, ఈత, ఖర్జూర, న్యూట్రి గార్డెన్ ప్లాంట్స్, బొప్పాయి, కరివేపాకు, ఇప్ప పువ్వు విత్తనాలు, తదితర మొక్కలు అందుబాటులో ఉండాలని అన్నారు. గ్రామ పంచాయితీలలో హై రిస్క్ మండలాల్లో ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని పంచాయితి అధికారిణి ఆదేశించారు. అనంతరం ఉల్లాస్, ఓపెన్ స్కూల్, బడిబాట పై సమీక్షించారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో సంబంధిత జిల్లాలోని అధికారులు పాల్గొన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారిణి అదిలాబాద్ గారి చే జారీ చేయనైనది.

## రైతులు సమీకృత వ్యవసాయం వైపు మళ్ళాలి.జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.







అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి రైతులు సమగ్ర సమీకృత వ్యవసాయ విధానాల వైపు అడుగులు వేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం ముధోల్ మండలంలోని తరోడ గ్రామంలో మహిళా రైతు అర్షియా బేగం నిర్వహిస్తున్న వ్యవసాయ క్షేత్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ క్షేత్రంలో ఐకెపి, నరేగా నిధులతో రూ.2 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన కొరమీను చేపల కుంటను, అలాగే చేపల ఆహారంగా ఉపయోగించే అజోల్ల పాండ్, పశువుల పాకలు, కూరగాయల తోటలను కలెక్టర్ పరిశీలించారు. చిన్న స్థలంలో చేపల పెంపకం ద్వారా ఎక్కువ లాభాలు పొందవచ్చని తెలిపారు. తక్కువ పెట్టుబడి, తక్కువ శ్రమతో సంవత్సరానికి నాలుగు లక్షల వరకు ఆదాయం రావచ్చన్నారు. అజోల్ల, సేంద్రీయ విధానాలతో చేపల పెంపకం, కూరగాయల సాగు చేస్తున్న రైతును కలెక్టర్ అభినందించారు. ఆసక్తి ఉన్న ఇతర రైతులు కూడా ఈ క్షేత్రాన్ని సందర్శించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రోత్సాహకాలను ఉపయోగించుకుని ఎక్కువ మంది రైతులు ఈ విధానాలను అనుసరించాలన్నారు. స్వయం సహాయ సంఘాలు కోల్డ్ స్టోరేజీల ఏర్పాటు దిశగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా పోర్టేబుల్ భూసార పరీక్ష యంత్రం పనితీరును అధికారులు కలెక్టర్కు వివరించారు. ఈ యంత్రాల ద్వారా భూసార పరీక్షలు త్వరగా, తక్కువ ఖర్చుతో పూర్తవుతాయని తెలిపారు ఈ క్షేత్ర సందర్శనలో ఆర్డీవో కోమల్రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, తహసీల్దార్ శ్రీలత, ఎంపీడీవో శివకుమార్, ఇతర అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## అదిలాబాద్ రూరల్ లో జిల్లా పాలనాధికారి రాజర్షి షా సుడిగాలి పర్యటన .









అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ గ్రామీణ న్యూస్ అదిలాబాద్ రూరల్ చిట్యాల్ బోరీ లో బుధవారం ఉపాధి హామీ పనులు MGNREGS వర్క్స్ CCT, పెబల్ బండింగ్ , నర్సరీ పనులను ఆకస్మికంగా తనిఖీ చేసిDRDO ,EE PR , MPDO, MPO APO ఇతర సిబ్బందితో పాటు వేతన దారులతో సంభాషించారు.

అదిలాబాద్ రూరల్ కచికంటి గ్రామం లోని ఇంట్లో వ్యక్తిగత ఇంకుడు గుంత నిర్మాణ పనులు, అంగన్వాడి కేంద్రం లో టాయిలెట్స్ నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ .

:– యాపల్ గూడ లోని రామాలయం ఆవరణలో SBM స్వచ్ఛ భారత్ మిషన్ లో కమ్యూనిటీ టాయిలెట్ నిర్మాణ పనుల పరిశీలన. బుధవారం అదిలాబాద్ రూరల్ లోని కచికంటి, చిట్యాల బొరిలలో జిల్లా పాలనాధికారి రాజర్షి షా ఆకస్మికంగా తనిఖీ చేసి ఉపాధి హామీ పనుల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా చిట్యాల బోరి నుండి ఉపాదిపనులు చేస్తున్న ఫారెస్ట్ లోకి రెండు కీలో మీటర్లు బైక్ మీద వెళ్లారు. ఈ తనిఖీలో ఉపాధి హామీ కూలీల సంఖ్య ఎంత, ఉదయం ఎన్ని గంటలకు వస్తున్నారు, చేపడుతున్న పనులు ఎప్పటి నుండి చేస్తున్నారు, రహదారుల నిర్మాణాల కొలతలు, తదితర కూలీలతో మాట్లాడి, పనుల నాణ్యతను పరిశీలించి పనుల నాణ్యతను మెరుగుపరచాలని అన్నారు. ఉపాధి హామీ పనులు సక్రమంగా జరగడం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగం తగ్గుతుందని, ప్రజల జీవనోపాధి మెరుగుపడుతుందన్నారు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఉపాధి హామీ పనిప్రదేశంలో పని చేసే వారి పేర్లనే మస్టర్లలో హాజరు వేసేలా మేట్లు చూడాలని పేర్కొన్నారు.

CCT "(నిరంతర కాంటౌర్ ట్రెంచ్" (Continuous Contour Trench) ఇది వ్యవసాయంలో నీరు , నేల సంరక్షణకు ఉపయోగించే ఒక పద్ధతి, కాంటౌర్ ట్రెంచింగ్ అని కూడా పిలుస్తారు. ఇది శుష్క ప్రాంతాలలో వ్యవసాయ ఉత్పత్తిని పెంచడానికి కూడా ఉపయోగపడుతుందని) దీని ద్వారా భూమి కోతకు గురికాకుండా వర్షం నీరు భూమిలో ఇంకడానికి ఫారెస్ట్ ఏరియాలో చేస్తున్న పనుల తీరును పరిశీలించారు.

నర్సరీలో పనుల పరిశీలన

గ్రామ పంచాయతీ పరిధిలోని ఏర్పాటు చేసిన నర్సరీని పరిశీలించి నర్సరీలో నాటిన మొక్కలకు ఉదయం, సాయంత్రం నీళ్ల పోసి, మొక్కలను బతికించాలని సూచించారు. ఈ ఏడాది సాధ్యమైనంతా తొందరగా మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.

కచికంటి లోని అంగన్వాడి కేంద్రం లో నిర్మిస్తున్న టాయిలెట్స్ నిర్మాణ పనులు పరిశీలించి

అనంతరం కచికంటి గ్రామం లో ఓ ఇంట్లో వ్యక్తిగత ఇంకుడు గుంతల నిర్మాణ పనులు పరిశీలించారు.

వ్యక్తిగత ఇంకుడు గుంతలు ఒక ఇంటికి సంబంధించి ఆ ఇంటిలోనే నిర్మించే చిన్న గుంతలు. ఇవి ఇంటి పైకప్పు మీద పడే వర్షపు నీటిని భూమిలోకి ఇంకిపోయేలా చేస్తాయని, ఇంకుడు గుంతలు నిర్మించడం వల్ల భూగర్భ జల మట్టం పెరుగడం తోపాటు బోర్లు ఎండిపోకుండా ఉంటాయని, వర్షపు నీరు వృధా కాకుండా ఉంటుందన్నారు.

బోర్లు ఎండిపోకుండా ఇంకుడు గుంతలు నీటి సంరక్షణకు దోహదపడతాయని, పర్యావరణాన్ని కాపాడతాయన్నారు.

వ్యక్తిగత ఇంకుడు గుంతలు

ఇంటి ఆవరణంలో, బోరు బావికి దగ్గరగా ఇంకుడు గుంతను నిర్మించుకోవాలని

భూమి వాలు ఉన్న చోట గుంతను నిర్మించడం వల్ల వర్షపు నీరు గుంతలోకి సులభంగా చేరుతుందని,

గుంత నిర్మించేటప్పుడు పైన నీరునిల్వకుండా చూసుకోవాలన్నారు.

ఇంకుడు గుంతలు కాలక్రమేణా అడుగు పట్టే అవకాశం ఉంటుందికాబట్టి, గుంతలను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని,

గుంతల చుట్టూ గడ్డి, చెట్లు పెరగకుండా చూసుకోవాలని సలహాలు సూచనలు చేశారు.

ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. తదనంతరం యాపల్ గూడ లోని రామాలయం ఆవరణలో SBM నిధులతో నిర్మించిన కమ్యూనిటీ టాయిలెట్ ను పరిశీలించారు. కలెక్టర్ వెంట drdo రవిందర్, ఎంపిడిఓ నాగేశ్వర్ రావు, సిబ్బంది, తదితరులు ఉన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారిణి అదిలాబాద్ గారి చే జారీ చేయనైనది.

## భూసమస్యల దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను త్వరిత గతిన పూర్తి చేయాలి. జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి రెవెన్యూ సదస్సులలో వచ్చిన భూసమస్యల దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. భూభారతి చట్టాన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్న కుంటాల మండలంలో నిర్వహించిన గ్రామ రెవెన్యూ సదస్సులు విజయవంతంగా ముగియడంతో బుధవారం కలెక్టర్ కుంటాల తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలోని 16 రెవెన్యూ గ్రామాల్లో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల ద్వారా మొత్తం 667 భూ సంబంధిత దరఖాస్తులు స్వీకరించినట్లు కలెక్టర్ వెల్లడించారు. మిస్సింగ్ సర్వే నంబర్లు, సాధాబైదామా,పేరు, చిరునామా మార్పులు, తప్పుల సవరణలు, మ్యూటేషన్ వంటి సమస్యలు తదితర అంశాలపై వచ్చిన దరఖాస్తులపై అధికారులు వివరాలను కలెక్టర్కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తుదారులకు నోటీసులు జారీ చేసి, ఇరు పక్షాల సమక్షంలో పారదర్శక విచారణ జరిపి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. ప్రజల భూములకు సంబంధించిన సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు రేపటి నుంచే చర్యలు చేపట్టాలని, దరఖాస్తుదారులను ఇయరింగ్కు పిలిపించి, రోజువారీగా పరిష్కరించిన దరఖాస్తుల వివరాలను నివేదిక రూపంలో సమర్పించాలని ఆదేశించారు. పారదర్శకంగా, ప్రభుత్వ నిబంధనల ప్రకారం సేవలు అందించడంతో పాటు, ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూభారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులపై ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ కోమల్ రెడ్డి, తహసీల్దార్లు కమల్ సింగ్, ప్రవీణ్ కుమార్, ఏజాజ్ అహ్మద్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ ఇంటి వారు కావాలి



తంగళ్ళపల్లి :అమృత్ తెలంగాణ: ప్రతి ఒక్కరూ ఇంటి వారు కావాలనే ఉద్దేశంతోనే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో 20 లక్షల ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ లక్ష్యంగా పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం తంగళ్ళపల్లి మండలం లో రెండో విడత క్రింద 500 ఇందిరమ్మ ఇండ్ల మంజూరి ఉత్తర్వులు ప్రభుత్వ పాఠశాల ఆవరణలో కేకే మహేందర్ రెడ్డి తో కలిసి కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను లబ్దిదారులు 30 రోజులు లోగా ప్రారంభించి, వచ్చే దసరా దీపావళి పండుగలు నూతన గృహములలో జరుపుకోవాలని లబ్దిదారులకు సూచించారు. తంగళ్ళపల్లి మండలంలో 602 ఇండ్ల లబ్ధిదారులకు నిర్మాణ ప్రొసీడింగ్స్ పంపిణీ చేయడం జరిగింది అన్నారు. ఈ ఇండ్ల నిర్మాణాల కోసం ఉచితంగా ఇసుకను కూడా అందిస్తున్నట్లు వారి పేర్కొన్నారు. ప్రభుత్వ విధి విధానాల ప్రకారం లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందన్నారు.

# రెడ్డి సంక్షేమ సంఘం వసతి గృహాలను ప్రారంభోత్సవం కార్యక్రమాలు పాల్గొన్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : ఆదిలాబాద్ పట్టణంలోని న్యూహౌజింగ్ బోర్డ్ కాలనీలో నూతనంగా నిర్మించిన రెడ్డి సంఘ వసతి గృహ ప్రారంభోత్సవం ఎంతో ఘనంగా నిర్వహించారు. ప్రారంభోత్సవంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎంపీ గెడం నగేష్ , మాజీ మంత్రులు ఐకే రెడ్డి, జోగు రామన్న, డీసీసీబీ చైర్మన్ ఏడీ బోజారెడ్డి, ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కంది శ్రీనివాస్ రెడ్డి, మాజీ జడ్పి చైర్మన్ సుహాసిని రెడ్డి , ఆదిలాబాద్ జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షులు నల్ల నారాయణరెడ్డి, తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఆదిలాబాద్ జిల్లా రెడ్డి సంఘం ఉపాధ్యక్షులు బోరంచు శ్రీకాంత్ రెడ్డి , ప్రధాన కార్యదర్శి గోపిడి రాంరెడ్డి, కార్యదర్శి కిష్టారెడ్డి ,PACS చైర్మన్ బాలూరి గోవర్ధన్ రెడ్డి , మాజీ మున్సిపల్ చైర్మన్ రంగినేని మనీషా, మాజీ కౌన్సిలర్లు పవన్ నాయక్, కలాల శ్రీనివాస్, తాజోద్దీన్, ముడుపు మౌనిష్ రెడ్డి , ముడుపు ప్రభాకర్ రెడ్డి, జ్యోతి రెడ్డి, పలు రాజకీయ పార్టీల నేతలు, రెడ్డి సంఘం అనుబంధ సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా బోరంచు శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ గత ఎన్నో ఏళ్లుగా కలగా మిగిలి ఉన్న రెడ్డి కులస్తుల వసతి గృహం నేడు ప్రారంభించుకోవడం ఏంతో సంతోషకరమన్నారు. సమిష్టి కృషితో భవన నిర్మాణానికి కృషిచేసిన ప్రతీ ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. పేదలకు రెడ్డి సంక్షేమ సంఘం అండగా నిలబడుతుందని తెలిపారు.




సమావేశంలో మాట్లాడుతున్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి

# కార్యకర్తలకు వెన్నంటూ అండగా ఉంటా జుక్కల్ ఎమ్మెల్యే

మదన్నూర్ : అమృత్ తెలంగాణ: జుక్కల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు వెన్నంటూ అండగా ఉంటానని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మి కాంతారావు హామీ ఇచ్చారు. జుక్కల్ నియోజకవర్గం స్థాయి కార్యకర్తల సమావేశం డోంగ్లి మండలంలోని కుర్లా యనబోరా గ్రామ శివారు పరిధిలోగల రాచేశ్వర్ ఆలయం ఆవరణంలో బుధవారం సాయంత్రం నిర్వహించారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశానికి పరిశీలిఖులుగా సత్యనారాయణ గౌడ్ గోపాల్ యాదవ్ హాజరుకాగా వీరితో పాటు జిల్లా పార్టీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే అధ్యక్షతన నిర్వహించగా నియోజకవర్గంలోని ఎనిమిది మండలాలైన డోంగ్లి, మద్నూర్, బిచ్కుంద, జుక్కల్, పెద్ద కోడప్గల్ ,పిట్లం ,నిజాంసాగర్ , మహమ్మద్ నగర్, మండలాల పార్టీ అధ్యక్షులు యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్గొనగా.. ఈ సమావేశానికి పరిశీలకులుగా వచ్చిన సత్యనారాయణ గౌడ్, గోపాల్ యాదవ్, జిల్లా అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ మాట్లాడారు. కేంద్ర రాష్ట్ర పార్టీ ఐ కమాండ్ ఆదేశాల మేరకు నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశాలు ఏర్పాటు చేసి రాబోయే కాలంలో పార్టీ బలోపేతానికి గ్రామస్థాయి మండల స్థాయి నూతన కమిటీల ఏర్పాటు రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికల్లో పార్టీ నాయకులు గెలుపే లక్ష్యంగా సమావేశాల నిర్వహణ కొనసాగుతుందని వారు తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గడిచిన 15 సంవత్సరాలు పార్టీకి పనిచేసిన నాయకులు కార్యకర్తలు ఎన్నో రకాలుగా ఒడిదొడుకులు ఎదుర్కొన్నారని పార్టీ కోసం కట్టుబడి పనిచేసిన ప్రతి ఒక్కరికి



నూతన కమిటీల ఎంపికలో గుర్తింపు ఉంటుందని ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. పార్టీకి వ్యతిరేకంగా పనిచేసే సహించనని పార్టీ తల్లి లాంటిదని పార్టీకి కట్టుబడి పని చెయ్యాలని కార్యకర్తలకు నాయకులకు హితవు పలికారు. హై కమాండ్ ఆదేశాల మేరకు జుక్కల్ నియోజకవర్గం లో క్రమశిక్షణగా పార్టీ బలోపేతానికి అండగా ఉంటానని గ్రామ కమిటీలు మండల కమిటీలు ఏర్పాటు విషయంలో పార్టీని నమ్ముకున్న వారికి పదవులు లభిస్తాయని తెలిపారు. ఎమ్మెల్యే పనితీరుపై పరిశీలకులుగా వచ్చిన సత్యనారాయణ గౌడ్ గోపాల్ యాదవ్ అలాగే జిల్లా పార్టీ అధ్యక్షులు కైలాస్ శ్రీనివాస్ అభినందించారు. ఈ సమావేశంలో నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల నుండి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# సైబర్ మోసగాళ్ల నుండి ప్రజలను అప్రమత్తం చేయాలి..

డిచ్ పల్లి :అమృత్ తెలంగాణ: సైబర్ మోసగాళ్ల బారిన ప్రజలు మోసపోకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని, గెమింగ్ యాప్ ల పట్ల ప్రజలు మోసపోకుండా ఎప్పటికప్పుడు వారికీ అవగాహనా కార్యక్రమాలు నిర్వహి0చాలని, గంజాయి నిర్మూలనకు అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీచేయడం జరిగిందని, ఎవరయిన గంజాయికి బానిసవుతే అలాంటి వారికి కౌన్సిలింగ్ చేయాలని, గంజాయి నిర్మూలనకు పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య పేర్కొన్నారు.బుదవారం డిచ్ పల్లి పోలీస్ స్టేషన్ ను బుధవారం పర్యవేక్షించారు. పోలీస్ స్టేషన్ ను మొత్తం కలియ తిరిగి పోలీస్ స్టేషన్ పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. రిసిప్షన్ సెంటర్ల పనితీరును , కంప్యూటర్ సిబ్బంది పనితీరును క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. 5S విధానం అమలు చేస్తున్నారా లేదా అడిగి తెలుసుకొని మొత్తం పరిశీలించి పలు సూచనలు చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రధానంగా ఎక్కువ ప్రమాదాలు ద్విచక్ర వాహనాదారులకు జరుగుతున్నందున, తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని సూచించారు.సిబ్బ0ది సాధక బాధలు ప్రతీ ఒక్కరిని అడిగి



తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో డిచ్ పల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ మల్లేష్ డిచ్ పల్లి ఎస్ హెచ్ ఓ మోహమ్మద్ షరీఫ్, డిచ్పల్లి మహిళా ఎస్ ఐ సుహాసిని పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్ఎఫ్ఐ కామారెడ్డి పట్టణ నూతన కమిటీ ఎన్నిక

కామారెడ్డి : అమృత్ తెలంగాణ: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కామారెడ్డి పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి ముదం అరుణ్ ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి పట్టణ నూతన అధ్యక్షుడిగా ఎస్, నితిన్ కార్యదర్శిగా కె రాహుల్, ఉపాధ్యక్షులుగా నవీన్, సాయి, తేజ, సహాయ కార్యదర్శులు గా శ్రీకాంత్ , సాయి ప్రకాష్ గౌడ్, కమిటీ సభ్యులుగా జ్ఞానేశ్వర్, అశోక్, మహేష్, సన్నీ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ కామారెడ్డి




పట్టణంలో విద్యార్థుల ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు. ఎస్ఎఫ్ఐ బలోపేతానికి కృషి చేస్తామని మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహిస్తామని అన్నారు.

# 'ముత్యమల్లే' మెరిసిన జాన్వీ జాన్వీ



ఈ కొత్త రూపంతో మతులు చెడగొడుతోంది. చూడటానికి కొంచెం సింపుల్ గా ఉన్నా కానీ, ముత్యాలు బీడ్స్ తో ఈ పొడవాటి లెహంగాను సర్వాంగ సుందరంగా డిజైనర్ మలిచారు. వేకువ ఝామును మంచు పూలు మిలమిల మెరిసాయి. కానీ ఈ దృశ్యంలో జాన్వీ కపూర్ మంచి ముత్యమల్లే మెరుస్తోంది. మెరుపు లాంటి జాన్వీ కుర్రకారు గుండెల్లో భడభాగ్నిని రాజేస్తోంది. ఈ సుందరమైన దృశ్యం కేన్స్ 2025 ఉత్సవాల్లో కనిపించింది. మొట్టమొదటి సారి జాన్వీ కపూర్ కేన్స్ లో ఆరంగేట్రం చేసింది. కేన్స్ లో తాను నటించిన 'హోమ్ బౌండ్' స్క్రీనింగ్ లో ఈ అద్భుతమైన లుక్ తో కనిపించింది. జాన్వీ ఈ కొత్త రూపంతో మతులు చెడగొడుతోంది. చూడటానికి కొంచెం సింపుల్ గా ఉన్నా కానీ, ముత్యాలు బీడ్స్ తో ఈ పొడవాటి లెహంగాను సర్వాంగ సుందరంగా డిజైనర్ మలిచారు. ప్రఖ్యాత ఫ్యాషన్ డిజైనర్ తరుణ్ తహిలియాని దీనిని డిజైన్ చేసారు. ఈ లుక్ లో గ్రేస్ ఉంది. గ్లామర్ ని సాంప్రదాయ బద్ధంగా ఎలివేట్ చేసే నైపుణ్యం కనిపించింది. ధడక్ తో ఆరంగేట్రం చేసిన జాన్వీ సహనటుడు ఇషాన్ ఖట్టర్ కూడా కేన్స్ 2025లో సందడి చేస్తుండడం విశేషం. అతడు విశాల్ జెత్వా కూడా జాన్వీతో పాటు కేన్స్ లో సందడి చేస్తూ కనిపించారు. ఈ ముగ్గురూ కేన్స్ 2025 లో 'హోమ్ బౌండ్' ప్రపంచ ప్రీమియర్ కోసం ఆత్రుతగా కనిపించారు. ఈ ఉత్సవాల్లో జాన్వీ కపూర్ గురూజీ, ప్రముఖ దర్శకనిర్మాత కరణ్ జోహార్ కూడా ఉన్నారు. కరణ్ ధర్మ ప్రొడక్షన్స్ భాగస్వామి అయిన బిలియనీర్ అదర్ పూనవాలా భార్య నటాషా కూడా ఈ ఉత్సవాలలో సందడి చేసారు. జాన్వీతో సోదరి ఖుషీ కపూర్, ఆమె ప్రియుడు శిఖర్ పహారియా కూడా బృందంలో చేరారు. వారి స్నేహితుడు ఓర్హాన్ అవత్రమణి అలియాస్ ఓర్రీ కూడా సందడి చేయడం హాట్ టాపిగ్గా మారింది. నీరజ్ ఘయ్వాన్ దర్శకత్వం వహించిన హోమ్ బౌండ్ ప్రచారానికి మిత్రలు అంతా ఏకమవ్వడం విశేషం.

# తెలుగు దర్శకుడిపై నటి కాస్టింగ్ కౌచ్ ఆరోపణలు

తాజాగా నటి సయామీ కౌర్ తన కెరీర్ ఆరంభంలో జరిగిన వేధింపుల ఘటనను గుర్తు చేసుకున్నారు. మీటూ ఉద్యమ పర్యవసానంలో చాలా మంది నటీమణులు మేల్ కోస్టార్స్ పై ఆరోపిస్తూ తెరపైకొచ్చారు. కొందరిపై కోర్టుల పరిధిలో విచారణలు జరిగాయి. ఏళ్ల తరబడి గ్యాప్ వచ్చాక ఆరోపించడం వల్ల ప్రయోజనం శూన్యం అని నిరూపణ అయింది. ఈ కేసుల్లో పోలీసులు సాక్ష్యాధారాలను సమర్పించడంలో విఫలమవుతున్నారు. ఇప్పటికీ కొన్నేళ్ల క్రితం జరిగిన ఘటనలను ప్రస్థావిస్తూ నటీమణులు కాస్టింగ్ కౌచ్ ఆరోపణలు చేయడం హాట్ టాపిగ్గా మారుతోంది. తాజాగా నటి సయామీ కౌర్ తన కెరీర్ ఆరంభంలో జరిగిన వేధింపుల ఘటనను గుర్తు చేసుకున్నారు. పాపులర్ బాలీవుడ్ వెబ్ సైట్ తో మాట్లాడుతూ సయామీ సంచలన వ్యాఖ్యలు చేసారు. తనకు 19 -20 ఏళ్ల వయసు ఉన్నప్పుడు అవకాశాల కోసం ప్రయత్నించగా, ఆ సమయంలో ఒక మహిళా ఏజెంట్ తనను రాజీ పడాల్సిందిగా దర్శకుడు కోరినట్టు తెలిపింది. అవకాశం కావాలంటే రాజీ పడాలని ఆమె సూచించింది. ఒక మహిళ ఇంకో మహిళతో ఈ మాట చెప్పడం ఆశ్చర్యపరిచిందని సయామీ ఇంటర్వ్యూలో వెల్లడించింది. మేడమ్ మీరు ఏం చెబుతున్నారో నాకు అర్థం కావడం లేదని అన్నాను. నేను పదే పదే దానిని రిపీట్ చేస్తూనే ఉన్నాను.. ఆపై చివరికి ఆమె ఇలా అంది. చూడండి.. మీరు అర్థం చేసుకోవాలి అని చెప్పింది. కానీ నేను ఆ మార్గంలో వెళ్లలేను. నా జీవితంలో నాకు కొన్ని పరిమితులు ఉన్నాయి. ఒక మహిళ ఇలా అనడం బాధించింది అని కూడా సయామీ ఇంటర్వ్యూలో అన్నారు. అయితే సయామీ ఖేర్ ఆ మహిళా కాస్టింగ్ ఏజెంట్ ఎవరో చెప్పలేదు. తనను కమిట్ మెంట్ అడిగిన దర్శకుడు ఎవరో కూడా వెల్లడించలేదు. ఆమె నన్ను రాజీ పడమని చెప్పిందని



మాత్రమే అన్నారు. సయామీ తెలుగు చిత్రం రేయ్ (2015)తో తెలుగులో నటనా రంగ ప్రవేశం చేసింది. మిర్జ్యా (2016)తో హిందీలో అరంగేట్రం చేసింది. మౌళి (2018), చోక్డ్ (2020), వైల్డ్ డాగ్ (2021), ఘూమర్ (2023) చిత్రాలలో నటించింది. ఆమె స్పెషల్ (2020), ఫాదు (2022) అనే వెబ్ సిరీస్‌లలో కూడా నటించింది. బాలీవుడ్ బబుల్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో సయామి ఖేర్ లైంగిక వేధింపుల ఆరోపణలు చేసారు. తెలుగు దర్శకుడు కమిట్మెంట్ అడిగాడని గుర్తు చేసుకున్నారు.

# అల్లు అర్జున్ అతిథిగా ఆ సంబరాలు..!

అల్లు అర్జున్ పుష్ప 2 సినిమా విడుదల తర్వాత కొన్ని వారాల పాటు విదేశాల్లో విశ్రాంతి తీసుకున్నారు. టాలీవుడ్ స్టార్ అల్లు అర్జున్ స్టార్‌డం పుష్ప 2తో ఒక్కసారిగా పెరిగి పోయింది. పాన్ ఇండియా రేంజ్‌లో స్టార్ హీరోల జాబితాలో చోటు దక్కించుకున్న అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో సినిమాను చేస్తున్నాడు. అనే వర్కింగ్ టైటిల్‌తో రూపొందుతున్న బన్నీ-అట్లీ కాంబో మూవీ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభంకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. అంతర్జాతీయ స్థాయి వీఎఫ్ఎక్స్ కంపెనీ ఈ సినిమా కోసం వర్క్ చేయబోతుంది. అంతే కాకుండా హాలీవుడ్ సినిమాలకు వర్క్ చేసిన సాంకేతిక నిపుణులు ఈ సినిమా కోసం వర్క్ చేయబోతున్నట్లు సమాచారం అందుతోంది. మొత్తానికి వీరి కాంబో మూవీ తెలుగు, తమిళ ప్రేక్షకుల్లోనే కాకుండా పాన్ ఇండియా ప్రేక్షకులకు ఆసక్తిని రేకెత్తిస్తోంది. అల్లు అర్జున్ పుష్ప 2 సినిమా విడుదల తర్వాత కొన్ని వారాల పాటు విదేశాల్లో విశ్రాంతి తీసుకున్నారు. అదే సమయంలో అట్లీ సినిమా కోసం ఫిజికల్‌గా రెడీ అయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోనే ప్రముఖ ట్రైనర్ సమక్షంలో రెడీ



అవుతున్న అల్లు అర్జున్ జులై నెలలో చిన్న బ్రేక్ తీసుకోబోతున్నట్లు సమాచారం అందుతోంది. యూఎస్‌లోని తెలుగు వారి కోసం ప్రత్యేక ఈవెంట్‌లో పాల్గొనేందుకు గాను అల్లు అర్జున్ వెళ్లనున్నారని సమాచారం అందుతోంది. జులైలో జరగబోతున్న 8వ అమెరికా తెలుగు సంబరాల్లో అల్లు అర్జున్ పాల్గొనేందుకు ఓకే చెప్పారు. ఇప్పటికే అల్లు అర్జున్ నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో నిర్వాహకులు అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నారు.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు

# ఇస్మార్ట్ నిధి చీరలో అందాల విందు



సవ్యసాచి మరియు మిస్టర్ మజ్ను సినిమాలతో హీరోయిన్ గా టాలీవుడ్ లో ఎంట్రీ ఇచ్చిన ముద్దుగుమ్మ నిధి అగర్వాల్. మొదటి రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద నిరాశ పర్చడంతో ఈ అమ్మడి కెరీర్ ముందుకు సాగడం కష్టమే అని అంతా భావించారు. కానీ అనూహ్యంగా ఈ అమ్మడికి ఇస్మార్ట్ సక్సెస్ దక్కడంతో కెరీర్ లో దూసుకు పోతుంది.రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందిన ఇస్మార్ట్ శంకర్ సినిమా లో నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటించి మెప్పించిన విషయం తెల్సిందే. ఆ సినిమా సూపర్ హిట్ అయిన వెంటనే పవన్ కళ్యాణ్ కు జోడీగా క్రిష్ దర్శకత్వంలో రూపొందుతున్న హరి హర వీరమల్లు సినిమా లో నటించే అవకాశం దక్కించుకుంది.సినిమాల్లో ఏ స్థాయిలోఅందాలను ఈ అమ్మడు ఆరబోస్తూ ఉంటుందో సోషల్ మీడియాలో అంతకు మించి అన్నట్లుగా ఈ అమ్మడి అందాల ఆరబోత ఉంటుంది. ఆకట్టుకునే ఫిజిక్ తో పాటు మంచి కలర్ ఇంకా బాడీ లాంగ్వేజ్ ఉన్న నిధి అగర్వాల్ ఏ ఫోటోలు షేర్ చేసినా కూడా జనాలు వావ్ అనాల్సిందే.

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309,
ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com